# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్రెజిల్ అధ్యక్షులు లులాడ సిల్వాతో చర్చలు జరుపుతున్నారు.
- ❖ దేశంలోని జాతీయ రహదారుల్లో కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు విదేశీ పర్యటనలో భాగంగా రేపు నమీబియా చేరుకుంటారు.
- ❖ బీహార్ రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రకటించారు.
- ❖ మధ్య భారత దేశంలో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బ్రెజిల్ లోని అల్వోరాడా ప్యాలెస్‌లో ఈ రోజు ఘన స్వాగతం లభించింది. బ్రెజిల్ అధ్యక్షులు ఆయన సతీమణితో కలిసి ప్రధానమంత్రికి స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వాతో నరేంద్రమోదీ కొద్ది సేపటి క్రితం చర్చలు ప్రారంభించారు. వాణిజ్యం, ఇంధన రంగం, అంతరిక్షం, సాంకేతికత, వ్యవసాయం వంటి పరస్పర ఆసక్తి ఉన్న రంగాలలో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తృతం చేయడంపై ఈ చర్చలు దృష్టిసారిస్తున్నాయి.

==============================

దేశంలోని జాతీయ రహదారుల్లో కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఉత్తరప్రదేశ్ లో ఫరీదాబాద్-నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ కారిడార్ వెంబడి “ఏక్ పెడ్ మా కే నామ్ 2.0” కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు జాతీయ రహదారుల వెంబడి 4.78 కోట్లకు పైగా మొక్కలు

నాటామని వివరించారు. దేశంలో 40 శాతం కాలుష్యం రవాణా రంగం నుంచే వస్తుంది కాబట్టి పర్యావరణం పట్ల రవాణా శాఖకు ఎక్కువ బాధ్యత ఉందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయిదు దేశాల పర్యటనలో చివరిదైన నమీబియా దేశానికి రేపు చేరుకుంటారు. భారత్ నమీబియా దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింతగా విస్తరించేందుకు ఈ పర్యటన దోహదపడనుంది. ఇరు దేశాల మధ్య  వాణిజ్య సంబంధాలు ఇంకా పెరిగేందుకు ఆస్కారం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నరేంద్ర మోదీ తొలి నమీబియా పర్యటన ఇండో-నమీబియా సంబంధాలలో కీలకంగా నిలుస్తుందని నమీబియాలో భారత హై కమిషనర్ రాహుల్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ప్రధానమంత్రి పర్యటనకు వ్యూహాత్మక ప్రాధాన్యత ఉందని ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ..

(వాయిస్ 25 సెకన్లు)

============================

బీహార్ రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక మహిళలకు ఈ రిజర్వేషన్లు వర్తించేలా చూస్తామన్నారు. కాగా, ఇప్పటికే ఆ రాష్ట్రంలోని మహిళలకు సామాజిక పెన్షన్‌ను ప్రభుత్వం పెంచింది. ఇపుడు మహిళలకు ప్రకటించిన రిజర్వేషన్లు వారికి మరింత ప్రోత్సాహం అందించేదిగా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

============================

నావికా దళ అధిపతి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి, వైమానిక దళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్, ఆర్మీ దళా అధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు న్యూఢిల్లీలో సీనియర్ సైనిక అధికారులను ఉద్దేశించి ఉమ్మడి కార్యకలాపాల నిర్వహణపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముగ్గురు అధిపతులు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

============================

క్రియాశీలకంగా లేని ప్రధానమంత్రి జన్ ధన్ ఖాతాలను మూసివేయాలని బ్యాంకులకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈరోజు స్పష్టం చేసింది. అటువంటి ఖాతాలను మూసివేయమని బ్యాంకులను కోరినట్లుగా ప్రచారం అవుతున్న వార్తలు అసత్యమని పేర్కొంది. క్రియాశీలకంగా లేని జన్ ధన్ ఖాతాల సంఖ్యను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపింది. ఆయా ఖాతాలను క్రియాశీలకంగా చేయడానికి ఖాతాదారులను సంప్రదించాలని బ్యాంకులకు సూచిస్తున్నామని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం జన్ ధన్ ఖాతాల సంఖ్య పెరుగుతున్నాయని వెల్లడించింది. కాగా, జన్ ధన్ యోజన ఖాతాలు, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన ఇతర సంక్షేమ పథకాలను గరిష్టంగా విస్తరించడానికి మూడు నెలలుగా ప్రచారం జరుగుతోందని కూడా ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

విరామం

============================

దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ విద్యా విధానం-2020 అమలు చేయాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేఖ గుప్తా అధ్యక్షతన ఈ రోజు జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగరంలో 900 కోట్ల రూపాయల విలువైన స్మార్ట్ తరగతులను ఏర్పాటు చేయాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. ఆ వివరాలను విద్యా శాఖ మంత్రి ఆశిష్ సూద్ పాత్రికేయులకు వెల్లడించారు. ఢిల్లీలో సమగ్ర డిజిటల్ క్లాస్‌రూమ్ విస్తరణ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఈ ప్రణాళిక కింద 75 పాఠశాలల్లో 2 వేల 446 స్మార్ట్ బ్లాక్‌బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

===========================

రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ సైన్స్ సెంటర్‌ను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువతలో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించడానికి ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. విజ్ఞాన్ సేతు చొరవతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీని స్థాపించామన్నారు. ఇదిలా ఉండగా స్థానిక పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను కూడా కేంద్రమంత్రి సందర్శించారు.

===========================

అహ్మదాబాద్ లో గత నెల 12న జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఈ రోజు పౌర విమానయాన శాఖకు తన ప్రాథమిక నివేదికను అందజేసింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ ఉన్నత వర్గాలు వెల్లడించాయి. తాము ఇప్పటివరకు జరిపిన విచారణ వివరాలను, కనిపెట్టిన అంశాలను తన ప్రాథమిక నివేదికలో పొందుపరిచామని ఏఏఐబీ తెలిపింది. కాగా, విమాన ప్రమాదంపై ఏఏఐబీ ఇంకా లోతైన దర్యాప్తు చేపట్టనుంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఏమిటో గుర్తించి, ఇకపై అలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు ఏఏఐబీ కృషి చేస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

===========================

ఆసక్తి ఉంటే ఎవరైనా వ్యోమగాములు కావచ్చునని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గత 12 రోజులుగా ఉంటున్న ఆయన, మేఘాలయా, అసోంకు చెందిన విద్యార్థులతో ఈ రోజు హ్యామ్ రేడియో సాయంతో కొంత సేపు పాటు విద్యార్థులతో సంభాషించారు.

===========================

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సీఈఓగా సంజోగ్ గుప్తా నియమితులయ్యారు. సంజోగ్ పేరును ఐసీసీ చైర్మన్ జైషా అధికారికంగా ప్రకటించారు.

===========================

మధ్య భారతదేశంలో రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్‌లలో రాబోయే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని IMD అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

===========================
===========================